క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలకు రేడియం స్టిక్కర్స్ అతికిస్తున్న ఎస్ఐ

పాలసముద్రం: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి హెల్మెట్ తప్పక ధరించాలని ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలకు రేడియం స్టిక్కర్స్ అతికించారు. వాహనదారులతో ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ క్షేమంగా గమ్యం చేరుకోవాలంటే రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. మద్యం తాగకుండా వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మునస్వామి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: వాతావరణ మార్పులతో తేమ ఎక్కువగా ఉంటుందని, ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు, ఏఎస్ఎంలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా కార్యకర్తలు పర్యటించి ప్రతీ ఒక్కరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, విరేచనాలు, చర్మ సమస్యలు ఎక్కువగా కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

నింద్ర: మండలంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తింపు సర్వేలో భాగంలో అగరం పేట గ్రామంలో సర్వే చేసి, గుర్తించారు. పిల్లలను భవిత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. మే 15వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జిల్లా స్థాయి సర్వేలు నిర్వహిస్తామని ఎంఈఓ వసుమతి దేవి, శ్రీధర్ రాజు తెలిపారు. మండలంలో ప్రతి గ్రామంలో సర్వే చేసి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను చేర్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు వెంకటేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాట గంగమ్మ జాతర



శ్రీబాట గంగమ్మ అమ్మవారు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని పచ్చికాపల్లం రోడ్డు అటవీశాఖ కార్యాలయం సమీపంలో వెలసి ఉన్న శ్రీబాటగంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రీతికరమైన అంబలి సమర్పించారు. బీసీ కాలనీలో మహిళలు పొంగళ్లు వండి, పిండి దీపాలు వెలిగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో భాగంగా ఆలయ ఆవరణాన్ని, బీసీ కాలనీ వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

పాలసముద్రం: జీవామృతం వినియోగంతో పంటలను ఆశించే చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చని, ఎలాంటి రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం లేదని ప్రకృతి వ్యవసాయ విభాగం ఎల్‌సీ ఆర్పీ ప్రతాప్ తెలిపారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. 100 లీటర్ల ద్రవ జీవామృతం తయారీకి 5 లీటర్ల గోమూత్రం, 5 కిలోల దేశీ ఆవుపేడ, ఒక కిలో బెల్లం, శనగపిండి, పిడికెడు పుట్టమన్ను, 100 లీటర్ల నీటిలో కలిపి 5 రోజులపాటు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం సవ్య దిశలో కలపాలని సూచించారు. అనంతరం దాన్ని వడగట్టి వచ్చిన ద్రావణాన్ని జీవామృతంగా వినియోగించుకోవచ్చన్నారు. దీన్ని మొక్కలకు వేసుకుంటే ఎలాంటి ఎరువులు, పురుగు మందులు వినియోగించాల్సిన అవసరం ఉండదన్నారు. సీఎం కండ్రిగలో నిర్మల రైతు సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పుష్ప, మహిళలు పాల్గొన్నారు.

హామీలకు మంగళం

- నేటితో కూటమి పాలనకు ఏడాది
- సూపర్ సిక్స్ గంగపాలు
- ఓట్లేసి గెలిపించిన వారికి మోసమే తొలిఏడాది గిఫ్ట్
- నేడు వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం



పుత్తూరు ప్రజాగళం సభలో హామీలు గుప్పిస్తున్న చంద్రబాబు నాయుడు

నగరి: ఏరుదాటాక తెప్ప తగలేసినట్లు అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తగలేసింది. సూపర్ సిక్స్ అమలును తలచుకుంటేనే భయమేస్తోందని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చెప్పడంతో పథకాలు అమలు అవుతాయా లేదా అన్న సందేహం ప్రజల్లో చోటుచేసుకుంది. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పథకాలన్నీ పక్కాగా అమలు చేసింది. గతంలో పవిత్ర గ్రంథంలా ఉన్న మేనిఫెస్టో నేడు చిత్తుకాగితంలా నలిగిపోయింది. హామీల పేరిట ప్రజలకు వెన్నుపోటు పొడవడంపై ప్రజల తరపున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేడు వెన్నుపోటు దినం నిర్వహించనుంది.

సూపర్ సిక్స్ అమలు కాకపోవడంతో నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు ఏడాదిలో అందని లబ్ధి

పథకం పేరు	అందాల్సిన వారి సంఖ్య	అందని లబ్ధి రూ.(కోట్లలో)
ఆడబిడ్డ నిధి	2,07,119	372.81
నిరుద్యోగ భృతి	22261	6.67
ఉచిత బస్సు ప్రయాణం	284282	
అన్నదాత	45634	91.27
తల్లికి వందనం	89184	133.78
ఉచిత గ్యాస్	115067	18.41 (రెండు సిలిండర్లకు)

అందరికీ రూ.15 వేలు అన్నారు



తన పిల్లలతో పుష్ప

ఈమె పేరు పుష్ప, భర్త పేరు మాయకృష్ణ కార్వేటినగరం మండలం కొల్లాగుంట గ్రామం. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. ప్రభుత్వం తల్లికి వందనం పథకంలో ఎందరుంటే అందరికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పడంతో నలుగురికీ రాకున్నా తొమ్మిదో తరగతి చదివే కుమార్తె యామినికి, పదో తరగతి చదివే సంతోష్‌లకు రూ.15 వేలు చొప్పున వస్తుందనుకున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి డబ్బులు అందలేదు. కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నారు.

నిరుద్యోగ భృతి ఏమైంది



ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీలలో నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా దానికి మార్గదర్శకాలు కూడా విడుదల కాలేదు. నిరుద్యోగులకు భృతి ప్రకటించలేదు. త్వరగా ఆచరణలోకి తెచ్చి నిరుద్యోగులకు ప్రతి నెల రూ.3 వేలు అందించాలి. వారికి ఆదరణగా నిలవాలి.

– మునిరాజు, నిరుద్యోగి, అత్తూరు, నింద్ర మండలం

తల్లికి పంగనామాలు



గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పథకం కింద ఏటా క్రమం తప్పకుండా నగదు మా ఖాతాలో జమఅయ్యేది. చంద్రబాబునాయుడు చదువుకునే వారందరికీ రూ.15 వేలు వంతున తల్లికి వందనం పేరిట ఇస్తామని నమ్మబలికారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా నా ముగ్గురు బిడ్డలకు ఒక్కరికీ ఒక్క రూపాయి వేయకుండా పంగనామాలు పెట్టారు. హామీలను నెరవేర్చలేని వారు హామీలు ఇవ్వడం ఎందుకు? నవ్వుల పాలవడం ఎందుకు?

– ఎ.జయలక్ష్మి, నందిమంగళం దళితవాడ

మూడు సిలిండర్లు లేనట్టేనా...



ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతి ఇంటికి సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పి తూతూ మంత్రంగా గతేడాది ఒక్క సిలిండర్ మాత్రమే ఇచ్చారు. ఈ ఏడాది రెండు ఉచిత సిలిండర్లు రాలేదు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తప్పనిసరిగా నెరవేర్చాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని వారు పరిపాలించడానికి అర్హులు కాదు.

– ఆనంద్‌కుమార్, ఏకాంబరకుప్పం, నగరి మండలం

మహిళలకు రూ.1500 ఇవ్వరా?



ఎన్నికల సమయంలో ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని ప్రచారం చేశారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారు. తీరా అందలం ఎక్కాక హామీల ఊసే లేకుండా పోయింది. సూపర్‌సిక్స్ అంటేనే భయమేస్తోందని ముఖ్యమంత్రి చెప్పడం చూస్తుంటే హామీలు అమలుపై సందేహాలు తలెత్తుతున్నాయి. రూ.1500 ఎప్పుడిస్తారా అని మహిళలు ఎదురుచూస్తున్నారు.

– రాధ, నింద్ర

ఉచిత బస్సు భాగ్యం కలిగేనా?



ఎన్నికల సమయంలో మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని చెప్పింది. అయితే ఇప్పటివరకు ఆ ఊసే లేదు. పక్క రాష్ట్రం తెలంగాణలో వెంటనే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశారు. ముఖ్యమంత్రి రాజకీయ చరిత్ర చూసుకుంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏది ఇంతవరకు నెరవేర్చలేదు. అలాగే ప్రస్తుతం ఇచ్చిన హామీలను కూడా గాలికి వదిలేశారు.

– సరళ, ఇల్లత్తూరు, విజయపురం మండలం

పెట్టుబడి సాయం లేదు



అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. తీరా అధికారం చేపట్టిన తర్వాత పెట్టుబడి సాయం ఊసే ఎత్తలేదు. ఏడాది కూడా పూర్తయింది. సాగు ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇకపై అయినా సాయం అందించాలి.

– వెంకటేష్, రైతు, పెద్ద తయ్యూరు, ఎస్ఆర్‌పురం మండలం

కృపాలక్ష్మి విజయం కోసం మోకాళ్లపై ప్రార్థన



మోకాళ్లపై ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ధనరాజ్ కుటుంబ సభ్యులు

గంగాధరనెల్లూరు: రానున్న 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా, గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా కృపాలక్ష్మి గెలుపొందాలని వైఎస్ఆర్ సీపీ కార్యకర్త ముక్కళత్తూరుకు చెందిన ధనరాజ్ వినూత్నంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని వేలాంగణి చర్చిలో ఇసుకపై ఆయన భార్య సుజాత, కుమార్తె వినీతతో కలిసి మోకాళ్లపై నడుస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గంగమ్మ గెరిగ ఊరేగింపు



నింద్రలో గంగమ్మ గెరిగ ఊరేగింపు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో గంగమ్మ జాతర ప్రారంభించారు. మంగళవారం గ్రామంలో గంగమ్మ గెరిగను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉదయం గంగమ్మకు అంబలి పోశారు. బుధవారం రాత్రికి గ్రామంలో గంగమ్మను ప్రతిష్టిస్తారని నిర్వాహకులు తెలిపారు. గురువారం గ్రామంలో గంగమ్మను ఊరేగించనున్నారు.

వెన్నుపోటు దినానికి తరలిరండి



పెనుమూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



వడమాలపేట మండలంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీరంగరాజపురం: వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రంలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ మణి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటల్లోపు 49 కొత్తపల్లి మిట్ట వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీగా గంగాధరనెల్లూరు అంబేడ్కర్ విగ్రహం వద్దకు సాగుతుందని తెలిపారు. అలాగే మండల తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తామన్నారు. ఎంపీపీ సరిత, జడ్పీటీసీ రమణ ప్రసాద్‌రెడ్డి, నాయకులు జనార్దన్, భూపతిరెడ్డి, బాబు, చిన్నబ్బ, యువరాజ్, మణి పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల కన్వీనర్ మణి

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రంలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ విజయమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నాయకులతో కలసి వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. మాజీ ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ బోర్డు మాజీ కార్యదర్శి ద్రాక్షాయణి, దూది మోహన్ పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ

వడమాలపేట (విజయపురం): అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఏడాది గడుస్తున్నా నెరవేర్చక పోవడంపై ఈ నెల 4వ తేదీన నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను వడమాలపేట మండలం కేంద్రంలో మంగళవారం వైఎస్ఆర్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. బుధవారం నగరిలో జరిగే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని నగరి నియోజకవర్గ బూత్ కన్వీనర్ సురేష్‌రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నందయ్య, సుబ్రమణ్యంరెడ్డి, దారా ఉమాపతి, చంద్రారెడ్డి, కమలమ్మ, శ్రీదేవి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మసేవలో మాజీ మంత్రి



గంగమ్మ సేవలో మాజీ మంత్రి రోజా

పుత్తూరు: నేసనూరు పంచాయతీ ఆనంబట్టు గ్రామంలో మంగళవారం నిర్వహించిన గంగ జాతరలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మకు సారెను సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. ముందుగా జాతర కమిటీల వారు ఆమెకు ఘన స్వాగతం పలికి, ఆలయ మర్యాదలు చేశారు.

వధూవరులకు ఆశీస్సులు

టీటీడీ కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన పుత్తూరు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ రాధా భర్త జయరామిరెడ్డి సోదరుడి కుమార్తె విజయలక్ష్మీ వివాహ రిసెప్షన్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

పాలలో వెన్నశాతం పెంచడంపై అవగాహన



వాటర్ ప్లాస్కులు, కాల్షియం ప్యాకెట్లు అందుకున్న మహిళలు

పాలసముద్రం: పాలలో వెన్నశాతం బట్టి ధరలు వేస్తామని ఏజీఎం చంద్రన్ తెలిపారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో డెయిరీకి పాలు పోస్తున్న మహిళలకు, పాల మిత్రాలకు సూపర్‌వైజర్ సుకుమార్ సమక్షంలో పాలలో వెన్న శాతం పెరగడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొంత మంది పాల ధరలు తక్కువగా ఉన్నాయంటున్నారని తెలిపారు. పాలలో వెన్నశాతం బట్టి పాల బిల్లులు వస్తామని తెలిపారు. అందుకే పాడిపశువులను శుభ్రంగా మంచి నీటితో కడిగి కాల్షియం పెట్టాలన్నారు. కొంచెం పిండి పెట్టాలని సూచించారు. అనంతరం మహిళలకు ప్రతి ఒక్కరికి వాటర్ ప్లాస్కులు, సబ్సిడీపై కాల్షియం ప్యాకెట్లు అందించారు.

నియంతృత్వంగా పాలన



మాట్లాడుతున్న చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను రద్దు చేయబోమని, అదనంగా సంక్షేమం అందిస్తామని ఆర్భాటంగా హామీలు గుప్పించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తోందని వైఎస్ఆర్ సీపీ రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి, నగరి నియోజకవర్గ పరిశీలకుడు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా, ఏడాది పాలన అంటూ జబ్బలు చరుచుకుంటున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు, ఇప్పుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. సంక్షేమ పాలనతో ప్రజల ఆదరణ పొందిన జగనన్నను ఓడించేందుకు కుట్రలు పన్ని, ఈవీఎంల మోసాలతో అధికారంలోకి వచ్చారని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా దగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ వెన్నుపోటు దినం పేరుతో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. వైఎస్ఆర్ సీపీ నేత సారథి పాల్గొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న అర్చకులు



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- 7 నుంచి 15వ తేదీ వరకు అప్పలాయగుంటలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్న టీటీడీ అధికారులు

వడమాలపేట(విజయపురం): అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆనవాయితీ ప్రకారం తిరుమంజనం జరిపించారు. ఈ సందర్భంగా వేకువనే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం చేపట్టారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలంతో ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. తదనంతరం 11 గంటలకు స్వామివారి సర్వదర్శనానికి భక్తులను అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు సూర్యకుమారాచార్యులు, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అప్పలాయగుంట ఆలయం

7 నుంచి వాహన సేవలు

బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరగనున్నాయి. 7వ తేదీ ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు ఊంజల్‌సేవ, రాత్రి 7 నుంచి 8.30 వరకు పెద్దశేష వాహనం, 8న ఉదయం చిన్నశేష వాహనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి హంస వాహనం, 9న ఉదయం సింహ వాహనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి ముత్యపు పందిరి వాహనం, 10న ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం, 11న ఉదయం పల్లకీలో మోహినీ అవతారం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రి గరుడ వాహనం, 12న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం గజ వాహనం, 13న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 14న ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం, 15న ఉదయం పల్లకీ ఉత్సవం, చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం కానున్నాయి.

నూతన సాంకేతికతతో అధిక దిగుబడులు



ఘన జీవామృతం తయారీని వివరిస్తున్న అధికారులు

నగరి: వ్యవసాయంలో నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త శ్రీరామ్ కుమార్ తెలిపారు. మంగళవారం నగరి మండలం ఎం.కొత్తూరు, వేలావడి, బుగ్గ అగ్రహారం గ్రామాల్లో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా శాస్త్రవేత్తలు వివిధ అంశాలపై రైతుకు అవగాహన కల్పించారు. ఘన జీవామృతం తయారీని ప్రత్యక్షంగా చేసి చూపించారు. శాస్త్రవేత్తలు డా.ఎం.మంజునాథ్, లక్ష్మీప్రసన్న, వేణుగోపాల్‌రావు, ఏఓ రాఘవేంద్ర, ఉద్యాన అధికారి లోకేశ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రేమ్ కుమార్, శోభ, మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.